# దుర్మార్గం

"మగ పిల్లాడు!"

ఆరుబయట బీడీకాల్చుకుంటూ - క్షణ క్షణానికీ అనుమానంగా ఇంట్లోకి చూస్తున్న విశ్వనాధం దగ్గరకు ఉత్సాహంగా వచ్చి చెప్పింది మంత్రసాని మాణిక్యం.

ఆ శుభవార్త విన్న విశ్వనాధం పొంగిపోయాడు... ఆనందంతో అతని మనసు ఉక్కిరి బిక్కిరై - వెంటనే మాట్లాడలేకపోయాడు.

"అమ్మగారికి తొలికాన్పు. అందులోను మగపిల్లవాడు! నాకు కట్నం ఘనంగా ఇప్పించాలి!" పైట చెంగుతో చేతులు తుడుచుకుంటూ చెప్పింది మాణిక్యం. ఆమె అలా ఆశపడి అడగటంలో తప్పులేదు. పూర్వకాలంలో మహారాజులూ జమిందారులూ అలాంటి శుభవార్త వినగానే తమ మెడలో వున్న వజ్రాలహారాన్నో, ముత్యాలదండనో తీసి - వార్తాహరులకు కానుకగా ఇచ్చేవారు. ఇప్పుడు కూడా అలాంటి శుభ సందర్భంలో పర్సులోంచి వందలూ వేలూ తీసివ్వగల స్తోమత వున్న వాళ్ళూ వున్నారు.

మాతృత్వం వరమైతే తండ్రి కావటం ఓ తన్మయత్వం!

విశ్వనాథానికి క్షణం సేపు అలాంటి తన్మయం కలిగినా మరుక్షణంలోనే అతన్ని కొండంత నిరుత్సాహం ఆవరించింది. ఏదో గుర్తుకొచ్చి జేబులో చేయి పెట్టాడు... బీడీకట్ట, అగ్గిపెట్టె, ఓ అయిదు రూపాయల కాగితం, కొంత చిల్లర చేతికి తగిలాయి....

"ప్రస్తుతానికి ఇది వుంచు మాణిక్యమ్మా! వారం రోజుల్లో నీకు చీరపెడతాను!" అన్నాడు విశ్వనాథం అయిదు నోటు ఆమె చేతుల్లోపెట్టి.

"అలాగే బాబు! వస్తాను!" అంటూ ఆ నోటును పైటచెంగున ముడివేసుకుని వెళ్లిపోయింది మాణిక్యమ్మ.

ఆమెకు చీరకొనివ్వాలంటే కనీసం వంద రూపాయలైనా కావాలి! అంత డబ్బు తేగలిగే శక్తి విశ్వనాథానికి లేదు. ఆ విషయం అతనికీ తెలుసు! కానీ అతను ఓ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. ఎలాగో యజమానిని అడిగి తనకిచ్చే జీతంలో నెలనెలా కొంత మినహాయించుకునే ఒప్పందంపై ఓ చీర తీసుకురాగల అవకాశం వుంది! ఆ ధైర్యంతోనే ఆమెకు ఆ 'వరం' ఇచ్చాడు.

మాణిక్యం వెళ్ళిపోయాక, చేతిలో వున్న బీడీ ముక్క దూరంగా విసిరేసి ఇంట్లోకి

వెళ్ళాడు విశ్వనాథం. నులకమంచం మీద సగం ప్రాణంతో వున్నట్టుగా కనిపిస్తున్న సరస్వతిని చేరుకున్నాడు. ఆమె పక్కనే పడుకునివున్న పసిగుడ్డుని చూశాడు. అప్రయత్నంగా అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

ఈ లోగా విశ్వనాథం మంచం పట్టెమీద కూర్చున్న అలికిడికి నెమ్మదిగా కళ్ళువిప్పి చూసింది సరస్వతి. భర్త కళ్ళల్లో మెరుస్తున్న కన్నీళ్ళను చూసింది. తండ్రి కాగలిగిన గర్వంవల్ల కళ్ళల్లో చిమ్మిన ఆనందభాష్పాలనుకుంది.

"అచ్చం నాపోలికట కదా?" బిడ్డ తలపై చేయివేసి అడిగిందామె.

కన్నీటి పొరల్లోంచే బాబుని చూస్తున్నాడు విశ్వనాథం...

"కానీ మీలాగే మహా నెమ్మది! అసలు ఎక్కువ ఏడవనేలేదు! చాలా ఆరోగ్యంగా వున్నాడట! బొడ్డుకోస్తూ, మాణిక్యమ్మ చెప్పింది!" మళ్ళీ అన్నది సరస్వతి.

ఆమె చెప్పే మాటలు వింటూనే ఆప్యాయంగా బాబు తలపై చేయివేశాడు విశ్వనాథం.

"ఇంక మనకు పిల్లలు వద్దండీ! వీడు ఒక్కడే చాలు! చందమామలా వున్నాడు! బాగా చదివించి ఇంజనీర్నో డాక్టర్నో చేద్దాం!" కొంతసేపయ్యాక చెప్పిందామె.

"అలాగే! తప్పకుండా చేద్దాం సరసూ!" అంటూ అక్కణ్ణుంచి లేచి బయటకు వచ్చేశాడతను.

అప్పటికి చుట్టూ బాగా చీకటి అలుముకుంది తన గుండెల్లో గూడుకట్టుకుంటున్న నిరాశలా!

ఇన్నాళ్ళూ తామిద్దరే! ఇపుడు మరో సంఖ్య పెరిగింది. అంటే అవసరాలు పెరుగుతాయి!

ఆలోచిస్తూ ఆకాశంలో మిణుకు మిణుకు మంటున్న నక్షత్రాల్ని చూస్తూ మళ్ళీ మరో బీడీ వెలిగించాడు విశ్వనాథం. గుండెలనిండా దమ్ములాగి పొగబయటకు వదిలాడు.. ఆ పొగలో, తన 'పొగచూరిన గతం' కళ్ళముందు మసకమసకగా కనిపించసాగింది.

విశ్వనాథం మధ్యతరగతి కుటుంబంలో ఇద్దరాడపిల్లల మధ్య పుట్టాడు. వాళ్ళనాన్న సీతాపతి మున్సిపల్ ఆఫీసులో గుమస్తా పని చేసేవాడు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విశ్వనాథాన్ని పెంచి పెద్దచేశాడు. ఇంటర్ పరీక్ష పేసవగానే విశ్వనాథం 'ఇంజనీరింగ్ ఎంట్రన్స్' పరీక్షకి కష్టపడి ప్రిపేరయ్యాడు. తల్లి చేతినున్న బంగారుగాజు అమ్మి ఎంట్రన్స్‌కి ముందు 'కోచింగ్' కూడా తీసుకున్నాడు. పరీక్ష బాగారాశాడు. 'తొమ్మిది వందల అరవయ్యో రాంక్ వచ్చింది!' 'సీటు దొరుకుతుంద'ని చాలామంది చెప్పారు. తాను ఇంజనీరు అయిపోయినంతగా ఆనందించాడు.

కానీ ఆ ఆనందం అట్టే రోజులు నిలువలేదు అతని ఆశ నిరాశయిపోయింది! తనకు సీటు లేదన్నారు. అయితే పదివందలకుపైగా రాంక్ వచ్చిన రాధాస్వామికి సీటు వచ్చింది. కారణం అడిగితే 'అతని కులం' అన్నారు. అలాగే పదకొండు వందల నలభై రాంక్ వచ్చిన మనోరమక్కూడా సీటు వచ్చింది!' కారణం అడిగితే 'అది ఆడపిల్లల కోటా' అన్నారు!

ఆ రాత్రి తన ఆశ ఆవిరైన రాత్రి, నిద్ర మానేసి మూగగానే ఏడ్చాడు విశ్వనాథం. తనుకూడా రాధాస్వామి కులంలో పుట్టనందుకూ ఆడజన్మ ఎత్తనందుకూ తనను తానే తిట్టుకున్నాడు. 'ఖర్మ' అనుకుంటూ తలకొట్టుకున్నాడు. చివరికెలాగో మనసు సరిపెట్టుకుని బిఎస్సీలో చేరాడు!

డిగ్రీ చేతికొచ్చాక విశ్వనాథం చాలా ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టుకున్నాడు. ఆఖరికి పదోక్లాసు అర్హత సరిపోయే ఉద్యోగాలకు కూడా 'అప్లయ్' చేసేవాడు. అలా రెండేళ్ళు గడిచిపోయాయే తప్ప అతనికి ఉద్యోగం దొరకలేదు.

ఈలోగా అతని తండ్రి రిటైరైపోయాడు. చేతికొచ్చిన 'ప్రావిడెంట్‌ఫండ్' డబ్బుతో పెద్దకూతురి పెళ్ళి చేసి అత్తగారింటికి పంపించాడాయన... ఇక ఇంటి బరువుతో పాటు చెల్లాయి పెళ్ళి చేయవలసిన బాధ్యత కూడా విశ్వనాథంపై విరుచుకుపడింది.

ఉద్యోగం కోసం హోరా హోరీ ప్రయత్నాలు కొనసాగించాడు. రికమండేషన్ లేక కొన్నీ, లంచాలు ఇవ్వలేక, మరికొన్నీ అతన్ని 'కాదుపొమ్మంటే'- కులాలూ, మాజీసైనికులూ, అంగవికలురు వంటి కోటాల పేరుతో ఇంకొన్నీ అందకుండా పోయాయి.

'పెళ్ళిచేస్తే అబ్బాయి జాతకం మారుతుందేమో' అని ఓ పెళ్ళిళ్ళపేరయ్య సలహా ఇచ్చాడు సీతాపతికి. 'అదీపాయింటే' అనిపించి 'సరే' అన్నాడాయన. వెంటనే పేరయ్య రెండు మూడు సంబంధాలు తీసుకొచ్చాడు. వాటిలో కాస్తంత మెరుగ్గా వున్న సంబంధం చూసి, వాళ్ళదగ్గర ఓ నలభైవేలు కట్నం తీసుకుని విశ్వనాథం పెళ్ళి అయ్యిందనిపించాడు సీతాపతి. అటు తర్వాత ఆ నలభైవేలూ మరో అయ్యచేతిలో పోసి, తన రెండోకూతుర్ని కూడా అత్తవారింటికి పంపేసి చేతులు దులుపుకున్నాడాయన.

విశ్వనాథం భార్య సరస్వతి అందంగానే వుంటుంది. స్కూల్లో పెద్దగా చదువుకోలేదు కానీ కొద్దో గొప్పో ప్రపంచాన్ని చదివింది. ఆ తెలివితేటలతోనే తన అత్తవారింటి దుస్థితినీ, భర్త పరిస్థితినీ అర్థంచేసుకుంది... ఆ ఇంట్లో కొత్త కోడలుగా అడుగు పెట్టినా - కోరికల్ని మాత్రం కొంగునే ముడిపెట్టుకుని, భవిష్యత్తుతో రాజీ పడటం నేర్చుకుంది.

ఇంతకాలం ఆ ఇంట్లో తానొక్కడే బరువని అనిపించేవాడు. భార్యకూడా రావటంతో

ఆ బరువు రెట్టింపైంది.... అయినా ఇంటిపనీ, వంటపనీ యావత్తూ సరస్వతే చూసేది. తను మాత్రం గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునేవాడు విశ్వనాథం!... భోజనం చేసే ప్రతిపూటా తనేదో తప్పుచేస్తున్న వాడిలా ఫీలయ్యేవాడు. పావలా సంపాదనలేకుండా అలా "ఉచిత భోజనం" చేయటం అతన్నెంతో బాధించేది.

ఒక రోజు పక్కింటావిడ వచ్చి సరస్వతిని పేరంటానికి పిల్చింది. తనకున్న నాలుగు చీరల్లో కాస్త బాగుంటుందనుకున్న చీర ఉతుక్కుని కట్టుకుందామె. సరిగ్గా అపుడే వీధిలో మల్లెపువ్వులమ్మే మనిషి వెడుతూంటే 'ఓ రూపాయి మల్లెపూలు కొంటారా' అని భర్తను అడిగింది.

విశ్వనాథం మనసుకి తేలు కుట్టినట్టయింది ఆక్షణంలో.

ఆమె అలా అడగటంలో కూడా అధికారం లేదు. అనుమానమే ధ్వనించింది.

జేబులో పావలాడబ్బులులేని తన దౌర్భాగ్యానికి తనను తానే అసహ్యించుకున్నాడు విశ్వనాథం.

"ఫర్వాలేదు లెండి!... మల్లెపూలు లేకపోయినా వాళ్ళు పేరంటానికి రానిస్తారు... అందరితో బాటు నాకూ వాయనం ఇస్తారు" - అంటూనే వెళ్ళిపోయింది సరస్వతి.

ఆ మాట - తన అసమర్థతకు పెట్టిన 'వాత' గా తోచింది విశ్వనాథానికి. కొడుక్కి పెళ్ళిచేసినా గ్రహస్థితి మారలేదనీ, ప్రయోజకుడు కాలేక పోయాడనీ దిగులు చెందిన అతని తల్లితండ్రులు ఏడాది తిరక్కుండానే ఒకరి తర్వాత మరొకరు కన్నుమూసారు.

ఆ తర్వాత ఉద్యోగం వస్తుందనే ఆశకు తిలోదకాలిచ్చి, ఓ బట్టల దుకాణంలో 'పదిహేను వందల' జీతానికి గుమస్తాగా చేరిపోయాడు విశ్వనాథం. అప్పటినించీ చాలీ చాలని జీతంతో అలాగే రోజులు నెట్టుకొస్తున్నాడు.

ఇద్దరితోనే బరువుగా సాగుతున్న తమ సంసారనావ - ఇప్పుడు ముగ్గురుతో మునిగి పోతుందేమోనన్న భయంతో - గతాన్ని నెమరువేసుకుంటూ భవిష్యత్తులోకి చూస్తున్న విశ్వనాథం క్షణంపాటు విలవిల్లాడిపోయాడు.

"వీడికి పేరేం పెడదాం?"... ఆ మర్నాడు పొద్దున్న బాబుకి నీళ్ళు పోశాక, సాంబ్రాణి పొగవేస్తూ అడిగింది సరస్వతి.

"వాడికి మనం 'పెట్టేపేరు' ముఖ్యంకాదు... పెద్దయ్యాక వాడు ప్రయోజకుడై పెద్ద ఉద్యోగం సంపాదించుకుని మనకి పేరు తీసుకురావటం ముఖ్యం!" అన్నాడు విశ్వనాథం. అతని మాటల ధోరణిలో అంతర్లీనంగా కదలిన మనోవేదన ఆమెకు అర్థంకాలేదు.

"మా నాన్న పేరు పెడదామండీ!... చలపతిరావు!" - అంది సరస్వతి వెంటనే.

"అలాగే!... నీ ఇష్టం!"

"పదకొండోరోజున బారసాల చేసుకుందాం. అప్పుడే పేరు పెట్టుకోవచ్చు! రామాలయంలో పంతులుగార్ని ఆ రోజు పొద్దున్న రమ్మని చెప్పండి!"

"అలాగే!" అన్నాడతను.

అయితే గుళ్ళోపంతులుగారి కంటే ముందు, నర్సింగ్‌హోంలో డాక్టరు దగ్గరకు వెళ్ళవలసిన అవసరం కలిగింది విశ్వనాథానికి.

నాలుగోనాడు అర్థరాత్రివేళ -

సరస్వతి పక్కలో నిద్రపోతున్న బాబు ఒక్కసారిగా 'కెవ్వు' మన్నాడు. ఉలిక్కిపడి నిద్రలేచింది సరస్వతి. కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ గుక్కపట్టి ఏడవటం ప్రారంభించాడు బాబు.

పుట్టినప్పటినుంచీ ఎక్కువగా ఏడవటంలేదని మురిసిపోయిన సరస్వతి వాడు అలా కెక్కటిల్లి ఏడుస్తుంటే కలవరపడింది. 'పీడకల ఏదైనా వచ్చిందేమో' అనుకుంటూ వాణ్ణి దగ్గరగా తీసుకుని పాలు కుడుపబోయింది. వాడు తాగలేదు. ఎత్తుకుని భుజాన వేసుకుంది. అయినా ఏడుపు ఆపకపోగా మరింత స్థాయి పెంచాడు. విశ్వనాథం కూడా నిద్రలేచి వచ్చి బాబును తన భుజం మీద వేసుకుని ఊరుకోబెట్టే ప్రయత్నం చేశాడు... ప్రయోజనం లేకపోయింది..... గుక్కపట్టి హృదయ విదారకంగా వాడలా ఏడుస్తూంటే సరస్వతి హృదయం ద్రవించిపోయింది. ఏం చేయాలో తోచలేదు ఆమెకు.

"కడుపులో నొప్పేమో?" అనుకుంది ఆందోళనగా.

అప్పటికి బాబు బాగా అలసిపోయాడు... ఒళ్ళు ఎర్రబడింది. ఇంకా గుక్కపట్టి ఏడుస్తూనే వున్నాడు. పక్కింటివాళ్ళు కూడా నిద్రలేచివచ్చారు.

"ఇప్పుడేం చేయాలి?" చేతుల్లో నిలువకుండా ఏడుస్తున్న బాబుని చూస్తూ అనుకున్నాడు విశ్వనాథం. వాడిబాధ చూస్తుంటే అతనికీ కన్నీళ్ళొచ్చాయి.

"అరగంట నించీ అలా కాళ్ళూ చేతులూ కొట్టుకుని ఏడుస్తుంటే - ఇంకా అలా చూస్తూ కూర్చుంటారేమిటీ? డాక్టర్ దగ్గరికీ తీసుకెళ్ళండి!" ఓ పెద్దావిడ సలహా ఇచ్చింది.

అప్పటికిగానీ వాళ్ళకు ఆ ఆలోచనే రాలేదు!

గబగబా బాబుని పక్కవీధిలోనే వున్న నర్సింగుహోంకి తీసుకెళ్ళారు. డాక్టరు వాడిపొట్ట నొక్కి పరీక్ష చేశాడు. 'టార్చ్‌లైట్' వేసి నోట్లో చూశారు. కళ్ళల్లో కూడా చూశాడు. ఆ తర్వాత ఏదో ఇంజక్షన్ చేశాడు... అప్పటికి అలసిపోయిన బాబు నెమ్మదిగా మగతనిద్రలోకి జారుకున్నాడు.

"ఏమైంది డాక్టరుగారూ! మా బాబుకి ఏమైందసలు?" అడిగింది సరస్వతి.

"అదే తెలియటంలేదు! ఎందుకైనా మంచిదని, ఏడవకుండా, నిద్రపోవటానికి మత్తు ఇంజక్షన్ ఇచ్చాను!" చెప్పాడాయన

ఆ తర్వాత బాబు చాలాసేపు నిద్రపోయాడు.

★ ★ ★

"మమ్మీ! నాకు ఉద్యోగం వచ్చింది మమ్మీ!" అంటూ ఉత్సాహంగా లోపలకు వచ్చాడు చలపతి.

వసారాలో కూర్చుని బియ్యంలో రాళ్ళు ఏరుతున్న సరస్వతీ, వాలు కుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్న విశ్వనాథం - ఒక్కసారిగా కొడుకువైపు చూశారు.

"పది నెలలు ట్రైనింగ్! ట్రైనింగ్‌లో నెలకు రెండువేలిస్తారు. ఆ తర్వాత నెలకు మూడువేలు జీతం. రేపే జాయినవ్వాలి డాడీ!" ఆర్డరు కాగితాన్ని విశ్వనాథానికిచ్చి చెప్పాడు చలపతి. అందులోని అక్షరాలు మసక మసకగా కనిపిస్తున్నాయి విశ్వనాథానికి. అప్పటికే అతను కళ్ళ నీళ్ళ పర్యంతం అయిపోయాడు. కళ్ళజోడు అద్దాలు కన్నీటితో తడిసిపోయాయి.

'తన కొడుకు ఇంజనీరు!'

ఆ ఆలోచనే అతన్ని ఆనందంతో కుదిపేస్తోంది.

"నాకు తెలుసురానాన్నా! నీకు ఉద్యోగం వస్తుందని నేనుముందే అనుకున్నాను! మగపిల్లాడికి తల్లిపోలిక వస్తే అదృష్టవంతుడవుతాడట! అందుకే నీకు ఇంటర్ పాసవగానే 'కోచింగ్' లేకుండా ఇంజనీరింగ్ సీటొచ్చింది. ఆపైన 'స్కాలర్‌షిప్' వచ్చింది. డిగ్రీరాగానే ఉద్యోగం కూడా వచ్చింది! నువ్వు మొదటినుంచీ అదృష్టవంతుడివే!" అంటూ కొడుక్కి దిష్టి తీసింది సరస్వతి.

"ఈ విషయం మా ఫ్రెండుకి చెప్పివస్తాను మమ్మీ" అంటూ వీధిలోకి పరుగెత్తాడు చలపతి.

"చూశారా మనవాడి ప్రతాపం? మీ పోలికా, ఆనవాయితీ రాలేదు. సంతోషించండి!" అంటూ భర్త దగ్గరకు వచ్చిన సరస్వతి - అతన్ని చూసి దిగ్భ్రాంతి చెందింది.

విశ్వనాథం కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నాడు!...

ఆ ధోరణి ఆమెకు అర్థంకాలేదు.

"ఏమిటండీ?.... చిన్నపిల్లాడిలా ఏమిటిది?" అంటూ తన పైటచెంగుతో అతని కన్నీరు తుడిచిందామె.

"నేను దుర్మార్గుణ్ణి సరసూ!.. నన్ను క్షమించు!" అతని కన్నీరు ఆగటంలేదు.

అతని వైపు అలాగే చూస్తోంది సరస్వతి.

"వాడు పుట్టిన నాలుగోరోజుననుకుంటాను - ఓ అర్ధరాత్రివేళ - వాడు గుక్కపెట్టి ఏడ్చాడు! గుర్తుందా?" అడిగాడు క్షణం తర్వాత దుఃఖాన్ని ఆపుకుంటూ.

"అవును! ఎంతకీ మానకపోతే నర్సింగ్‌హోంకి కూడా తీసుకెళ్ళాం!" గుర్తు చేసుకుంటూనే చెప్పిందామె.

"అసలు అపుడు వాడు అలా ఎందుకు ఏడ్చాడో తెలుసా?"

"ఎందుకూ?"

"అపుడు నేను ఓ దారుణమైన పని చేశాను సరసూ! ఏ తండ్రీ చేయకూడని కిరాతకం చేశాను!" ఆమె తెల్లబోయి చూస్తూంటే - అతనింకా చెప్తున్నాడు.

"నీ పొత్తిళ్ళలో ఆదమరచి నిద్రపోతున్న వాడి దగ్గరకు దొంగలా వచ్చి వాడి లేలేత పాదాన్ని పక్కకు విరిచేశాను!"

"ఆ!?" ఉలిక్కిపడింది సరస్వతి! ఆమెకు తన పాదాలకింద నేల కదలినట్టుగా అనిపించింది.

"అవును సరసూ! వాడి కులాన్ని మార్చలేను. వాణ్ణి ఆడపిల్లను చేయలేను! పెద్దయ్యాక డొనేషన్లు కట్టి చదివించలేను! చదువయ్యాక లంచాలిచ్చి ఉద్యోగం కొనిపెట్టలేను! ఉద్యోగం రాకుండా వాడికి పెళ్ళిచేయలేను! అందుకే నా చేతనైన పని - అదే కసాయివాడిలా ఆ 'దుర్మార్గం' చేశాను. అందుకే వాడిపుడు అలా కుంటుతూ నడుస్తున్నాడు. అందుకే - వాడికి 'అంగవికలుర' కోటాలో ఆనాడు ఇంజనీరింగ్ సీటొచ్చింది. అది చదవటానికి స్కాలర్‌షిప్ వచ్చింది. అందుకే ఇపుడు అప్లయ్‌చేసిన వెంటనే వుద్యోగం వచ్చింది... లేకపోతే..." ఇంకా ఏదో చెప్తున్నాడు విశ్వనాథం... కానీ ఆమెకు వినిపించటంలేదు.

"మీరు... మీరే ఇలా కసాయివాడిలా..."

"అవును సరసూ! కసాయివాణ్ణే ! కన్నకొడుక్కి కలలో కూడా ఏ తండ్రీ తలపెట్టకూడని దారుణానికి ఒడిగట్టిన నాపేరు 'గిన్నీసుబుక్'లో రాయాలి! కానీ ఈ పని ఎందుకు చేశానో తెలుసా?... నామీద నాకు అసహ్యం కలిగి ఆ పని చేశాను! ఈ వ్యవస్థమీద కక్షకట్టి ఆ పాపానికి తలపడ్డాను! పెళ్ళి చేసుకుని భార్యతో సుఖపడాలే తప్ప పావలా మల్లెపూలు కొనిపెట్టలేని దుస్థితికి కుమిలి కుమిలి ఏడ్చే పరిస్థితి వాడికి రాకూడదని చేశాను..." అంటూనే కూర్చీలో వెనక్కివాలిపోయి బాధగా కళ్ళు మూసుకున్నాడు విశ్వనాథం పేరుగల ఆ దుర్మార్గపు నాన్న!!

*(ఈనాడు - ఆదివారం - 25-11-1990)*

★ ★ ★